క్లుప్తంగా

వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవాలు



కోదండరామపురంలో అమ్మవారి ఊరేగింపు

మనుబోలు: మండలంలో దసరా ముగింపు ఉత్సవాలను శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ మనుబోలులో, సాయిశర్మ కోదండరామపురంలో దసరా చావిళ్ల వద్ద అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం కాళికాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసి దేవతామూర్తుల ప్రతిమలు, ఆర్చిలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన కోలాటం, తీన్‌మార్ బ్యాండ్, తప్పెట్లు, మంగళవాయిద్యాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. యువకులు బాణాసంచా పేలుస్తూ ఉత్సవాల వెంట సందడి చేశారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఉత్సవం మంగళవారం ఉదయం 10 గంటల వరకూ కొనసాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కాళికామాత గ్రామోత్సవం


హిందూ మత సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న మోవిడి శ్రీనివాసులు

కొడవలూరు: హిందూ మత సంరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ ఎంతగానో కృషి చేస్తోందని ఆ సంఘ నేత మోవిడి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం త్యాగరాజ సంగీత నృత్య కళాశాలలో ఆ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మత గౌరవానికి భంగం కలుగకుండా ఎర్‌ఎస్‌ఎస్ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు సుధీర్‌స్వామి, సాయిబాబ, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, శిరం మల్లికార్జున, శేషగిరిరావు, పేట మధు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: చిత్రకారుడిగా, నవలా రచయితగా, కవిగా విభిన్న పాత్రలు పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు అని గ్రంథాలయాధికారి అల్లాడి నరసింహారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రంథాలయంలో బాపిరాజు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి మాట్లాడుతూ సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి స్వాతంత్య్ర ఉద్యమాల్లో బాపిరాజు క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. నవ్య సాహిత్య పరిషత్‌ను ఏర్పాటు చేసి ఎందరో చిత్రకారులకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారుడిగా, సంపాదకుడిగా సేవలందించారని గుర్తుచేశారు. తన చిత్రాలతో సమాజాన్ని జాగృతం చేశారని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ ప్రణాళికలు నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్ కుమార్, సురేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. ఎండ

పొదలకూరు: సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో ఎండల వేడిమి ఉంటుంది. అయితే అక్టోబర్‌లో వర్షాలకు బదులు ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఉత్తరాంధ్రలో తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి రైతులు నష్టపోతుంటే ఇక్కడ చినుక పడటం లేదు. అడపాదడపా వాన కురిసినా మెట్టపంటల సేద్యానికి మాత్రమే ఉపయోగపడుతున్నట్టు రైతులు వెల్లడిస్తున్నారు. ఈనెలలో వర్షాలు ముంచిపోయాల్సి ఉండగా ఎండలు ఉగ్రరూపం దాల్చాయి.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

నగరపాలక సంస్థ పరిధిలో అనేక ఖాళీ స్థలాలున్నాయి. వీటిపై పర్యవేక్షణ లేక అందులో అపరిశుభ్రత నెలకొంది. దీంతో దోమలు, కీటకాల బెడద అధికంగా ఉంటోంది. పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన స్థల యజమానులు పట్టించుకోవడం లేదు. ఇందుకు చర్యలు చేపట్టాల్సిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మౌనంగా వ్యవహరిస్తోంది.

- ఏపుగా చెట్లు పెరిగినా పట్టించుకోని స్థల యజమానులు
- నగరంలో అనేక ఖాళీ స్థలాల్లో నెలకొన్న అపరిశుభ్రత
- ఫలితంగా దోమల బెడద



సత్యనారాయణపురం నేతాజీ నగర్‌లో ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన మొక్కలు

నెల్లూరు(బారకాసు): ఎస్‌ఎంసీ పరిధిలో దాదాపు 10 వేలకు పైగా ఖాళీ స్థలాలున్నాయి. ఆయా స్థలాలకు సంబంధించిన యజమానులు సింహభాగం ఎక్కడో ఉంటున్నారు. మరికొన్ని స్థలాలకు సంబంధించిన యజమానులు అందుబాటులో ఉండి కూడా వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. వాస్తవంగా ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత సంబంధిత యజమానులదేనని ఎస్‌ఎంసీ అధికారులు అనేక సార్లు చెబుతున్నప్పటికీ వాటిని పెడన చెవిన పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పరిశుభ్రంగా ఉంచుకోకపోతే చర్యలు

ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే సంబంధిత యజమానులకు ఎస్‌ఎంసీ శానిటేషన్ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. వాటికి స్పందించకపోతే స్వయంగా కార్పొరేషన్ అధికారులే మెషీన్లు, కార్మికులచే ఆయా ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేసి అందుకు అయిన ఖర్చును సదరు స్థలాల యజమానుల నుంచి వసూలు చేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో ఏపుగా మొక్కలు పెరిగిపోయి చెట్లు, పొదలతో దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు, క్రిమీ కీటకాలు, పాముల బెడద అధికంగా ఉంటోంది. వాటివల్ల ఆయా ఖాళీస్థలాల సమీప ప్రాంతాల్లోని నివాసాలుంటున్న ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తోంది.

పట్టించుకోని శానిటేషన్ అధికారులు

ఎస్‌ఎంసీ పరిధిలో కేవలం ఇంటింటి చెత్త సేకరణ, రోడ్లు శుభ్రపరచడం, కాలువల పూడికలు తొలగించడం తప్ప ఖాళీ స్థలాల్లో నెలకొన్న అపరిశుభ్రతను గాలికి వదిలేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే సంబంధిత అధికారులు స్పందించి అపరిశుభ్రత నెలకొన్న ఆయా ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకోవడం.. తరువాత పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఎస్‌ఎంసీలోని శానిటేషన్ విభాగాధికారులు ఖాళీ స్థలాల్లో నెలకొన్న అపరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని సంరక్షించాలని కోరుతున్నారు.



శ్రీనివాస నగర్ నాలుగో వీధిలోని ఖాళీ స్థలంలో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు, రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మార్చే పనులు చేపడుతున్న కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జీవీఆర్ కాలనీ, లక్ష్మీనరసింహాపురం, పొదలకూరు రోడ్డు సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంగల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

8 నుంచి ఆధార్ క్యాంపులు

నెల్లూరురూరల్: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం అక్టోబర్ 8 నుంచి 14వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9 తేదీల్లో దర్గామిట్టలోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల, 10, 11 తేదీల్లో దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్‌లో, 13, 14 తేదీల్లో మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపులు జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘చలో విజయవాడ’ జయప్రదానికి పిలుపు



ర్యాలీ చేస్తున్న ఫ్యాప్టో నేతలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కార్యవర్గ సభ్యుడు చిట్టేడి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎస్ కాంపౌండ్ నుంచి వీఆర్సీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ పీఆర్సీని విడుదల చేయడంతో పాటు బకాయిలు చెల్లించాలన్నారు. మెమో 57ను అమలు చేయాలన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జావీద్, మురళీకృష్ణ, ప్రసాద్, మాధవ్, శేషు, నరసింహం, హజరత్, పిచ్చిబాబు పాల్గొన్నారు.

నెల్లూరు జట్టు తొలి విజయం



విజయం సాధించిన నెల్లూరు జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనంతపురంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు ఆదివారం తొలి విజయం సాధించింది. పశ్చిమ గోదావరి జట్టుపై జరిగిన పోటీలో తొలుత నెల్లూరు జట్టు 15 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 121 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పశ్చిమ గోదావరి జట్టు 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 106 పరుగులు సాధించడంతో నెల్లూరు జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది.

జిల్లా యోగా జట్ల ఎంపికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విశాఖపట్నంలో జరిగే 39వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పాల్గొనే నెల్లూరు జిల్లా యోగా జట్ల ఎంపికలను ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కలివేలపాళెం రెయిన్‌బో స్కూల్‌లో జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో 160 మంది బాలబాలికలు, స్త్రీలు, పురుషులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి రెయిన్‌బో స్కూల్ ప్రిన్సిపల్ అరుణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు గూడూరు రాజ, కోవూరు శ్రీను, కో–ఆర్డినేటర్ పద్మావతి, రవీంద్ర, రాజేంద్ర, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన తప్పనిసరి



డాక్టర్ మహేష్‌ను సన్మానిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(అర్బన్): మెదడు, వెన్నుపూస, నరాల వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెన్నై కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్ స్పెషలిస్ట్ డాక్టర్ మహేష్ అన్నారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మెనింజైటీస్ అవగాహన దినోత్సవాన్ని స్థానిక పొగతోటలోని రిచ్ ఆస్పత్రి సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. మెదడు, వెన్నుపూస చుట్టు రక్షిత పొరలకు ఇన్‌ఫెక్షన్ సోకి వాపు వస్తే దానిని మెనింజైటీస్‌గా పేర్కొంటామన్నారు. దీనిపై అజాగ్రత్త వహిస్తే ప్రాణానికే ప్రమాదమని తెలిపారు. కొన్ని రకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలు, ఫంగస్‌ల వల్ల మెనింజైటిస్ వస్తుందన్నారు. ఈ జబ్బులో ప్రధానంగా జ్వరం, మెడ బిగుసుకుపోవడం, చర్మంపై దద్దుర్లు, జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఒక్కో దఫా ఫిట్స్ తదితర లక్షణాలుంటే మెనింజైటీస్ జబ్బుగా భావించి అత్యవసరంగా సమీప ఆస్పత్రిలో చికిత్స అందించాలన్నారు. ప్రారంభ దశలోనే వైద్యం చేయిస్తే రోగి కోలుకుంటారన్నారు. అనంతరం పీఎంపీ నాయకులు డాక్టర్ మహేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కార్యదర్శి శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, రామదాసు, శ్రీధర్‌రావు, శంకర్రావు, రామరాఘవయ్య, మాల్యాద్రి పాల్గొన్నారు.

రంగారావుకు సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ నాయకుడు వేలూరి రంగారావు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా రెండోసారి నియమితులైన సందర్భంగా అయన్ను ఘనంగా సన్మానించారు. నగరంలోని పెద్దాస్పత్రి ఎదురుగా ఉన్న తిరుపతినాయుడు కల్యాణ మండపంలో లెమన్ ట్రీ సంస్థ అధినేత కె.హరిప్రసాద్, ఏవీపీ కొల్లా రాఘవరెడ్డి సౌజన్యంతో అన్ని వాకర్స్ అసోసియేషన్ల సభ్యులు ఆదివారం పాల్గొని రంగారావును సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యం, కార్యదర్శి స్నేహా సురేష్, గాలి రఘురామ్ నాయుడు, బాసం శేషగిరి, బుర్ర వెంకటేశ్వర్లు, వసుంధరాదేవి పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం తల్పగిరి కాలనీలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం తణుకుకు చెందిన ప్రవాస భారతీయులు (అమెరికా) భాగవతుల మాధవి- ప్రవీణ్ దంపతులు రూ.లక్షను విరాళంగా అందజేస్తున్నట్లు తిక్కన మహాకవి లలితాపీఠం అధ్యక్షుడు ఆలూరు శిరోమణిశర్మ తెలిపారు. అందులో తొలివిడతగా రూ.35 వేలను ప్రారంభ పనుల కోసం దేవస్థానం నిర్వాహకులు మెట్టా వెంకటేశ్వర్లు, నాగరాజులకు ఆదివారం ఆ దంపతుల తరఫున తాను అందజేసినట్లు శిరోమణిశర్మ వివరించారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డు గౌతమ్‌నగర్‌లోని హరిత వృద్ధుల ఆశ్రమంలో పొదలకూరు మండలంలోని చెర్లోపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుధాకర్‌రావు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. తన తల్లి జ్ఞాపకార్థం వీటిని అందజేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మనుబోలు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. శనివారం రాత్రి మనుబోలుకు చెందిన చిట్టేటి ప్రవల్లిక దసరా ఉత్సవాలు చూసి తిరిగి ఇంటికి వెళుతుండగా వేగంగా వచ్చిన మోటార్‌బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం బంధువులు నెల్లూరు డీఎస్‌ఆర్ ఆస్పత్రికి తరలించారు.

- ఆదివారం ఉదయం బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఆటోను మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో కొలనకుదురుకు చెందిన డ్రైవర్ పిగిలం మస్తానయ్యకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం గూడూరుకు తరలించారు. ఈ ప్రమాదాలపై పోలీస్ కేసులు నమోదు కాలేదు.
- మనుబోలు మండల కేంద్రంలో కొందరు ఆకతాయిలు నిత్యం వేగంగా మోటార్‌బైక్‌లు నడుపుతూ గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై పోలీసుల నుంచి స్పందన ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బకాయిలు చెల్లించాలని డిమాండ్



మాట్లాడుతున్న చేనేత సంఘం నాయకులు

పొదలకూరు: చేనేత కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చేనేత అధ్యయన యాత్రలో భాగంగా వారు ఆదివారం మండలంలోని తాటిపర్తి గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా రూ.127.85 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. బకాయిలను చెల్లించి అండగా నిలవాలని కోరారు. వచ్చే బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2 వేల కోట్లను చేనేతల కోసం కేటాయించాల్సిందిగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఉపాధ్యక్షుడు పముజుల హరి, నాయకులు ఆకురాతి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోదాముపై దాడులు



విడవలూరు : బాణసంచా గోదాముపై పోలీసులు దాడులు చేసిన ఘటన మండలంలోని వెంకటనారాయణపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెంకటనారాయణపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అనధికారంగా లైసెన్స్ లేకుండా బాణసంచాను తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై నరేష్ తన సిబ్బందితో దాడులు చేశారు. పోలీసుల రాకతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో అక్కడున్న ఎనిమిది బాక్సుల బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకుని చేసుకొని కేసు నమోదు చేశారు.

ఘనంగా టీచర్స్ డే



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్): స్థానిక విశ్వసాయి ఎస్సార్కే స్కూల్‌లో రోటరీ క్లబ్ సౌత్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ టీచర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సౌత్ ప్రెసిడెంట్ మాలికాబేగం, కార్యదర్శి సుభద్రాదేవి, మెంబర్లు భానుమతి, నరసింహారావు, సుధాకర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, హరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి జెడ్పీ వాకర్స్ అభినందన



నెల్లూరు(బృందావనం): పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఫ్రీ మెడికల్ సీట్ సాధించిన విద్యార్థిని జవళిని జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ వాకర్స్ సంఘం ఉపాధ్యక్షురాలు ఏస్తేరు రాణి మనుమరాలు జవళి విజయవాడ సిద్ధార్థ్ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీట్ సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎంవీ కృష్ణయ్య, యు.చెంచయ్య, రాజగోపాల్, ఖాజామస్తాన్, హర్షవర్ధిని, మెట్టు దీప, మెట్టు సుజన, జవళి తల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బధిరుల దినోత్సవం



మాట్లాడుతున్న డీఆర్వో విజయకుమార్

నెల్లూరు(పొగతోట): ప్రపంచ బధిరుల, అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ పాల్గొని, మాట్లాడారు. వైకల్యం శరీరానికి మాత్రమేనని, సంకల్పానికి కాదన్నారు. జిల్లాలో బధిరుల సంక్షేమానికి అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు 100 మంది మూగ, చెవిటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు మహమ్మద్ అయూబ్, జిల్లా బధిరుల సంఘం నేతలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 19/1 వార్డు సచివాలయంలో ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ నాయబ్‌ను సస్పెండ్ చేస్తూ నగరపాలక కమిషనర్ వైఓ నందన్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమైన సమాచారం పొందుపరిచిన కంప్యూటర్ లాగిన్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి ప్రభుత్వ సర్వీసులను దుర్వినియోగం చేయడం, విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాడని 25/3 సమతానగర్ వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి జి.హరికృష్ణ ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించిన కమిషనర్ పెండింగ్ ఎక్వైరీ కింద తాత్కాలికంగా నాయబ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. నాయబ్ స్థానంలో అదే వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న దిలీప్‌ను ఇన్‌చార్జి ఎడ్యుకేషన్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతిష్టాత్మకంగా చెకుముకి టాలెంట్ టెస్ట్



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

నెల్లూరు(అర్బన్): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఈ సంవత్సరం నగరంలోని 150 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని ఆ వేదిక నగరాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్, ఇతర కార్యక్రమాలపై నగర కమిటీ సమావేశం హరనాథపురంలోని జేవీవీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చెకుముకి టెస్ట్‌ను శాస్త్రీయ కోణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహిస్తామన్నారు. జేవీవీ కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. అలాగే ఈనెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 9, 10వ తేదీల్లో అన్ని పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. బాలికలకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కాలేషాబాషా, డాక్టర్ శ్రీను నాయక్, జిల్లా కార్యదర్శి విజయకుమార్, మాదాల రాము, సమత విభాగం కన్వీనర్ విజయమ్మ, నగర కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేట గొల్లవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో శ్రీపొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్ నగర కమిటీ సభ్యులు శేగు రాము, కల్యాణి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం, దుస్తుల పంపిణీ చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారికి బంగారు ముక్కుపుడకను బహూకరించారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, గూడూరు శ్రీధర్‌రెడ్డి, పి.రమేష్, శేగు నరసింహారావు, షేక్.అబ్దుల్‌మజీద్, కె.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, శారద, కృష్ణ, నాగరాజు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.